హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలని డిమాండ్

కాచిగూడ, జూన్ 10: తెలంగాణలో ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న ఏపీ హోంగార్డులను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని హోంగార్డ్‌ల జాయింట్ సెక్రటరీ ఎస్.నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో హోంగార్డు ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.. ఏపీకి చెందిన 400 మంది హోంగార్డులు తెలంగాణలో పనిచేస్తున్నారని, తమ కుటుంబాలు మాత్రం ఏపీలోనే ఉన్నారని పేర్కొన్నారు. పిల్లలను స్కూల్లో చేర్చాలని, కొంతకాలంగా ఇక్కడే విద్య నభ్యసిస్తే ఏపీలో స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకొని తమను ఏపీ రాష్ట్రానికి పంపించాలని వేడుకున్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు చేయాలి

అంబర్ పేట డివిజన్ లోని పలు ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించాలని స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి డివిజన్ లోని చెన్నారెడ్డినగర్ తో పాటు పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ వీధిదీపాల విభాగం అధికారులతో కలిసి ఆయన వెలగని వీధి దీపాలను పరిశీలించారు. వెంటనే వెలగని దీపాలను వినియోగంలోకి తేవాలని ఆయన సూచించారు.

– గోల్నాక, జూన్ 1

బతుకమ్మకుంట స్టేటస్‌కో పొడగింపు

ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట, జూన్ 10 : అంబర్ పేట మండలం, బతుకమ్మకుంటలో గల ఏడు ఎకరాలపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టులో వేసిన సీఎంఏ(సివిల్ మిసిలియన్ అప్పీల్)లో మంగళవారం కోర్టు స్టేటస్‌కోను జూలై ఒకటికి పొడగించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ మే 7వ తేదీన ఇచ్చిన స్టేటస్‌కో ఆర్డర్స్ ను హైకోర్డు డివిజన్ బెంచ్ పొడగించిందని బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే మే 28న హైకోర్టు మూడవ వెకేషన్ ఇచ్చిన స్టేటస్ కో మోడిఫికేషన్ ఆర్డర్ సబ్జెక్టు భూమిది కాదని క్లారిఫై చేసిందని చెప్పారు. ఈ ఆర్డర్‌తో హైడ్రా గొంతులో వెలక్కాయ ఇరుక్కున్నట్లయిందన్నారు.

పుట్టగొడుగుల్లా అనుమతి లేని పాఠశాలలు

- ఏదో తరగతి వరకు అనుమతి తీసుకుని పదో తరగతి వరకు నడిపిస్తున్నవైనం
- నష్టపోతున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాధికారులు

అంబర్ పేటలోని హమ్మద్‌నగర్‌లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాల

అంబర్ పేట, జూన్ 10 : అంబర్ పేట మండల పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అయినా సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు అసలే అనుమతులు లేవు. మరికొన్నింటికి ఏడవ తరగతి వరకు అనుమతి ఉండి యజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా 10వ తరగతి వరకు నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలియక తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ విధంగా అనుమతి లేని పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఆయా యాజమాన్యాలు ఇచ్చే టీసీలు చెల్లక పోవడంతో వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. అనుమతి లేని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతికి వస్తే వారు పరీక్ష ఫీజు చెల్లించలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోని సదరు యజమాన్యాలు అనుమతి ఉన్న పాఠశాలల ద్వారా విద్యార్థుల ఫీజులు చెల్లిస్తూ వారు పదవ తరగతి పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాల్సి దుస్థితి ఏర్పడింది. ఇదిలాఉండగా అనుమతి లేని పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఆయా యజమాన్యాలు ఇచ్చే టీసీలతో వారు పైచదువులకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ అనుమతి లేని పాఠశాలలపై తాము ఫిర్యాదు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు తమకు ప్రభుత్వం ఇచ్చిన పర్మిషన్‌ను ఆయా పాఠశాలల వద్ద పెద్ద అక్షరాలలో డిస్‌ప్లే చేయాల్సి ఉంది. కానీ అంబర్ పేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు ఈ నిబంధనలేవీ వర్తించడం లేదని వారు అంటున్నారు. ఫైర్ సేఫ్టీ, సానిటేషన్, ఫిట్నెస్, విశాలమైన గదులు, విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా క్రీడా మైదానాలు ఇక్కడ మచ్చుకు కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు. అదేవిధంగా అంబర్‌పేట డివిజన్‌లోని బాపూనగర్ లో ఏర్పాటుచేసిన యూనిసన్ పాఠశాలకు 7వ తరగతి వరకు అనుమతి ఉండి , యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పదవ తరగతి వరకు కొనసాగిస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ఇదే యూనిసన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం అనుమతి లేకుండా అహ్మద్ నగర్‌లో మరో బ్రాంచ్‌ను తెరుస్తోందని వారు పేర్కొన్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని గోల్నాక, శాంతినగర్, సాయిబాబా టెంపుల్ లైన్, తులసీరామ్ నగర్ తిలక్ నగర్, న్యూ నల్లకుంట, బాయమ్మ గల్లి, పటేల్‌నగర్, ప్రేమ్ నగర్, న్యూ మల్లికార్జున్ నగర్, ఆర్‌నగర్, రెడ్‌బెల్డింగ్, బురుజు గల్లి, కుమ్మరి బస్తీ తదితర ప్రాంతాల్లో కొన్ని ప్రైవేటు పాఠశాలలు అనుమతులు లేకుండానే యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నడుపుతున్న యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలలను సీజ్ చేయాలని వారు కోరుతున్నారు.

మహిళా బిల్లులో ఓబీసీ మహిళ లకు సబ్ కోటా కల్పించాలి

అభివాదం చేస్తున్న భాగ్యలక్ష్మి

రవీంద్రభారతి, జూన్ 10 : 2029లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో సబ్ కోటా కల్పించాలని ఓబీసీ మహిళా కమిటీ తెలంగాణ రాష్ట్ర శాఖ నిర్ణయించిందని, బీసీ మహిళలకు అన్ని రంగాలలో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ ఓబీసీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేయాలని, అందులో 50 శాతం మహిళలకు అన్ని పార్టీలు అవకాశాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా మహిళా బిల్లు కోసం బీసీ మహిళలు పోరాటం చేశారని, మహిళలు అన్ని రంగాలలో వెనుకబడిపోయారని ఆమే ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగాలలో స్కిల్ డవలప్‌మెంట్ కోసం 100 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాజీవ్ వికాస్ కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి మహిళలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. అదేవిధంగా వితుంతు పింఛన్లు, అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, అంబిక, బొగ్గరపు ఉశ, అక్కనపల్లి శ్రీనివాసచారి, పాల్వాయి శ్రీనిధి, ఎ.మాధవి సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు సమస్యను పరిష్కరించండి

మంత్రి సురేఖతో దేవస్థాన సేవాసమితి ప్రతినిధులు

అంబర్‌పేట, జూన్ 10 : రాబోవు ఆషాఢ మాస బోనాల కంటే ముందే అంబర్‌పేట మహంకాళి టెంపుల్‌కు ఎదురుగా రోడ్డుపై ఉన్న మసీదు సమస్య ను పరిష్కరించాలని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ దృష్టికి తెచ్చారు. త్వరలో నగరంలో జరుగబోయే ఆశాఢ బోనాలను పురస్కరించుకొని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సలహాదారు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి ఈ సమస్యను లేవనెత్తారు. వారికి వేరే చోట స్థలాన్ని చూపిస్తే రోడ్డుపై ఉన్న మట్టికప్పలు తొలగించేందుకు వారు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అలాగే మహంకాళి గుడికి వెనుకభాగంలో ఉన్న పోలీసు శాఖకు చెందిన 200 గంజాల స్థలాన్ని గుడి కోసం కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రులు బోనాల తర్వాత ఈ విషయాలపై చర్చిద్దామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా మంత్రలను కోరారు. దేవస్థా న సేవ సమితి ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి సుధాకర్, కార్యనిర్వహక కార్యదర్శి కిశోర్, కోటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నిర్వహించే బోనాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని వినతి

చార్మినార్, జూన్ 10: ఢిల్లీ లోని తెలంగాణ భవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం కమిటీ కోరింది. దేవాలయ చైర్మన్ బి.మారుతీ యాదవ్,మాజీ చైర్మన్ కె. వెంకటేష్ , కోశాధికారి ఎ.చంద్ర కుమార్ ప్రతినిధి బృందం మంగళవారం మంత్రిని జూబ్లీహిల్స్ లోని ఆమె నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి వినతిపత్రం సమర్పించారు. జూన్ 30, జులై 1, 2 తేదీల లో బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ తో పాటు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఢిల్లీలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

జీహెచ్ఎంసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూన్ 10 : నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు సూచించారు. మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ఉన్న పలు ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే పలు అభివృద్ధి పనులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రశాంతి, ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రశాంత్, మనీషా, పృథ్వి, వర్క్ ఇన్ స్పెక్టర్లు నరేందర్ , రవి , మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి

బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురా నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతతో నిర్మించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అధికారులకు చెప్పారు. మంగళవారం కార్పొరేటర్ ఈ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక బస్తీవాసులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపట్టలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులిజాల గెల్వయ్య, జె.బాలరాజు, అడ్వకేట్ శ్రీహరి పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూన్ 10

పురుషోత్తంకు జిమ్‌ఆఫ్‌హయ్యర్ ఎడ్యుకేషన్ అవార్డు

ఇటికల పురుషోత్తం, మహమూద్‌లకు జిమ్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అవార్డు ప్రదానం చేస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం ప్రతినిధులు

అబిడ్స్, జూన్10 : ప్రపంచ శాంతి, సమానత్వాన్ని తీసుకు రావడంలో ఉన్నత విద్య ప్రాముఖ్యత ఎంతో ఉందని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఇయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్-I ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం అన్నారు. తెలంగాణ మేధావులు ఫోరం, తెలంగాణ ఇంట్రడక్షన్ ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాసబ్ ట్యాంక్‌లో గల తెలంగాణ ఉన్నత విద్యా మండలి కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ ఉన్నత విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2020 -2021 లో వెలువడిన ఒక రిపోర్ట్ ప్రకారం మన దేశంలోని 18 -23 ఏళ్లలోపు వయసు వారిలో 28.4% మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, పురుషుల్లో 28.3 శాతం మంది, మహిళల్లో 28.5 శాతం మంది మాత్రమే ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ -II ఎస్కే మహమూద్ పాల్గొని మాట్లాడారు. అమెరికా దేశ పర్యటనలో ఉన్న తెలంగాణ మేధాలు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె మహమూద్ లు ఉన్నత విద్యారంగంలో 35 సంవత్సరాలుగా నిర్విరామంగా విద్యాభివృద్ధికి అపారమైన సేవలు అందించినందుకు జిమ్‌ఆఫ్‌హయ్యర్ ఎడ్యుకేషన్ అవార్డు 2025 అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అక్తార్ అలీ, ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ట్రైనర్ డాక్టర్ రవితేజ చౌహన్, మహమ్మద్ సలీం, ఫాతిమా, కాశమని శామ్‌రావు ముదిరాజ్, జి. వేణుగోపాల్, బి. సూర్య, ఎం. గన్‌శామ్ పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు

ప్రజలకు పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్ 12 ఏఎంఓహెచ్ డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్లో ఆయన ఎంఐఎం నాయకుడు జాఫర్ ఖాన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, జూన్ 10

జలమండలి అధికారులపై కార్వాన్ ఎమ్మెల్యే ఆగ్రహం

మెహిదీపట్నం, జూన్ 10 : ప్రజలకు నీటి సరఫరా సక్రమంగా చేయకపోవడంపై జలమండలి అధికారులపై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొయినుద్దీన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారులు తమ తీరును మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం టోలిచౌకి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. 15 రోజులుగా కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మంచినీటి సరఫరా సక్రమంగా లేదని, డ్రైనేజీ ఓవర్ ఫ్లో లు ఉన్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదంటూ ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారులు వాళ్ల పని వాళ్లు చేయకుండా ఏం చేస్తున్నారో చెప్పాలంటూ డీఓపీ అమరేందర్ రెడ్డిని ప్రశ్నించారు. దీంతో అవాక్కైన డీఓపీ జీఎంలు జాన్ షరీఫ్, శ్రీనునాయక్‌లను. ఎమ్మెల్యే ముందే మందలించారు. వారం రోజుల్లో పనితీరు మార్చుకోక పోతే తీవ్ర స్థాయిలో చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ, జూన్ 10: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, దాసర్లపల్లి గ్రామానికి చెందిన రాహుజ భార్య చాంది(59) కూలీ. మంగళవారం యాకత్‌పుర.. డబీర్ పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా దావఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణాచారి తెలిపారు.

రైల్లో దొంగతనం

కాచిగూడ, జూన్ 10 : కోయంబత్తూర్ స్పెషల్ రైలు దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గౌలిగూడ ప్రాంతానికి చెందిన భవాని సింగ్(62) కోయంబత్తూర్ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య గుర్తుతెలియని వ్యక్తులు అతని బ్యాగును దొంగిలించారు. అందులో 10 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 22 వేల నగదు, ఖరీదైన ఫోన్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

వ్యక్తి చావుకు కారణమైన నలుగురి అరెస్ట్

చాంద్రాయణగుట్ట, జూన్ 10 : బాకీ తీర్చమని అడగటంతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. దీంతో ఇందుకు కారణమైన నలుగురిని బండ్లగూడ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ పటేల్ నగర్‌లో నివసించే సాగర్ అలియాస్ కుమార్ (57) మేస్త్రి. ఇతడు స్థానికంగా ఉన్న నరసింహులు వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చకుండా తప్పించుకు తిరుగుతున్న సాగర్‌ను ఆదివారం రాత్రి నరసింహులు అప్పు తీర్చాలని అడిగాడు. దీంతో మనస్థాపానికి గురైన సాగర్ అదే రోజు అర్ధరాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. నరసింహులు తన అల్లుడు, మరో ఇద్దరితో కలిసి బెదిరించడంతోనే సాగర్ ఉరివేసుకున్నట్లు పోలీసులు గుర్తించి మంగళవారం నరసింహులు, యూసుఫ్, ఖాసీం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడంలో హిందీ ప్రధాన పాత్ర

హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న వారికి విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

అబిడ్స్, జూన్ 10: దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడంలో హిందీ ప్రధాన పాత్ర పోషిస్తుందని, హిందీ భాషాభివృద్ధికి, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్, ఫోన్లు లేని రోజుల్లో హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థను స్థాపించి 90 ఏళ్లుగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం విశేషమని అభినందించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ 90వ వార్షికోత్సవాలను మంగళవారం నాంపల్లి స్టేషన్ రోడ్డులోని సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. భారతదేశంలో విభిన్న భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నాయని వీటన్నింటిని హిందీ భాష ఐక్యంగా ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాలతో పాటు ఆదివాసీలు ఉండే ప్రాంతాల్లో, ఈశాన్య రాష్ట్రాల్లో సైతం హిందీ చక్కగా మాట్లాడుతుండడం శుభ పరిణామం అన్నారు. ఇతర భాషలను నేర్చుకుంటూ గౌరవిస్తూనే హిందీ భాషను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సెంట్రల్ హిందీ డైరెక్టర్ సునీల్ బాబురావు కులకర్ణి మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో హిందీ విశేష పాత్ర పోషించిందని గుర్తు చేశారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ ఎంతో మందికి హిందీ నేర్పించడంతో పాటు అనేక మందిని హిందీ అధ్యాపకులుగా, ప్రొఫెసర్లుగా తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రకాంత్ కావడే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి, ప్రొఫెసర్ సురేష్ పురి, శృతికాంత్ భారతి, రమాదేవి, గిరిధర్ రావు, కే.రామచందర్, ఏకే రాజు, మహేశ్వరి, విభా భారతి, సుష్మా దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న పలువురికి విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రధానం చేశారు. అదే విధంగా హిందీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

యువకుడు అదృశ్యం

రాజన్ కుమార్

కాచిగూడ, జూన్ 10: చెప్పల్ బజార్‌లో యువకుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి.రవికుమార్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజన్ కుమార్ పాస్వన్ (18) కూలీ. మే 30వ తేదీన ఇంట్లోంచి వెళ్లిన రాజన్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కలత చెందిన తండ్రి సాజో పాస్వన్ మంగళవారం రాత్రి కాచిగూడ పీఎస్ లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

గిరిజన జాతి జాగృతం కోసం పుస్తకాలు తేవాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్, జే రాజారాంనాయక్, రాంబాబునాయక్

రవీంద్రభారతి, జూన్ 10 : బంజారల జీవితాన్ని ప్రతిబింబించే ఆనాటి గిరిజనుల జీవన స్థితిగతులపై 1973 లో రూపొందించిన ఆంగ్ల మోనోగ్రాఫ్‌ను నేటి తరానికి ఉపయోగపడేలా తెలుగులో అనువదించి ప్రచురించడం అభినందనీయ మని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. గిరిజన జాతి జాగృతం కోసం ఇలాంటి పుస్తకాలు మరిన్ని తీసుకురావాలని అన్నారు. మంగళవారం దేశోద్ధారక భవన్‌లో బంజార రచయితల సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో 1961 నాటి బంజార గిరిజనుల జీవనం పుస్తకావిష్కరణ కార్యక్రమం డీఆర్ఎస్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా హాజరైన కో దండరామ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇలాంటి ప్రచురణలు గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం విధానాల రూపకల్పనకు తోడ్పతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతులను సంబంధిత ప్రభుత్వ అధికారులకు కూడా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనువాదకులు ప్రొఫెసర్ జే రాజారాం నాయక్, అంగోతు రాంబాబునాయక్, ముడావత్ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



షాదీముబారక్ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్‌జైస్వాల్ పేర్కొన్నారు. నాంపల్లి కార్యాలయంలో నయాబ్ తాసీల్దార్ విశ్వేశ్వరరావు తో కలిసి ఆయన షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

– అబిడ్స్, జూన్ 10

జంటహత్యల కేసులో వీడిన మిస్టరీ..

ఉద్యోగం తీసేశారన్న పగతోనే వృద్ధ దంపతుల హత్య

మాజీ డ్రైవర్‌తోపాటు మరొకరు అరెస్ట్

బండ్లగూడ, జూన్ 10 : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ జనవైతన్య కాలనీలో గురువారం జరిగిన జంట హత్యల కేసులో మిస్టరీ వీడింది. తనను ఉద్యోగంలో నుంచి తొలగించ